క్లుప్తంగా

పురుగు మందులు లేని కూరగాయలు తినాలి

చిట్టమూరు : పురుగు మందులు, రసాయనాలు వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను తినాలని మాస్టర్ ట్రైనర్ ధనమ్మ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం రైతు సాధికార సంస్థ ప్రతినిధులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల స్టాల్ ఏర్పాటు చేసి విక్రయాలు చేపట్టారు. పశువుల ఎరువు, వేపాకుల కషాయం పిచికారీ చేసి పండించిన కూరగాయలను ప్రజలకు అందజేస్తున్నామన్నారు. రసాయాలు వాడిన ఆహార పదార్థాలు తినడం వల్ల చిన్న వయస్సులోనే పలు రకాలు వ్యాధులు వస్తున్నాయని వివరించారు.

ఖనిజాన్ని తరలిస్తున్న లారీ, క్రేన్ స్వాధీనం

సైదాపురం: అనుమతులు లేకుండా యార్డు నుంచి క్వార్ట్జ్ ఖనిజాన్ని తరలిస్తున్న లారీని, ఖనిజాన్ని లోడు చేస్తున్న క్రేన్‌ను సోమవారం తహసీల్దార్ రమాదేవి స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ విలేకరులతో మాట్లాడుతూ చాగణం సమీపంలోని పూజిత యార్డులో అనుమతులు లేకుండా క్వార్ట్జ్ ఖనిజాన్ని తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్టు తెలిపారు. లారీతో పాటు క్రేన్‌ను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించామన్నారు. ఎస్‌ఐ క్రాంతికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ఓజిలి: రక్తదానం ప్రాణదానంతో సమానమని కుందాం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కనుమూరు గోపాల్‌రెడ్డి, కేజీఆర్ దంత వైద్యశాల వైద్యాధికారి క్రాంతికుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అత్తివరం ఉన్నతపాఠశాలలో సోమవారం ఎల్లు గురుమూర్తి జ్ఞాపకార్థం యువత రక్తదాన శిబిరం నిర్వహించారు. గ్రామంలోని యువకులు స్వచ్ఛందంగా రక్తం దానం చేశారు. అనంతరం గురుమూర్తి సేవలను కొనియాడారు.

మహిళలు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి

దక్కిలి: మహిళలు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి బిందు ప్రియాంక తెలిపారు. తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో సోమవారం దగ్గవోలు, సంగనపల్లిలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. బీపీ, షుగర్ పరీక్షలు, పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ మామోగ్రామ్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ కోసం పాప్‌స్మియర్ పరీక్షలు చేశారు. స్విమ్స్ వైద్యులు చైతన్య భాను, పద్మావతి, దగ్గవోలు, సంగనపల్లి సర్పంచులు కోలా చిన్నమ్మ, ఆర్ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శులు వెంకటాద్రి, శిరీష, వైద్య సిబ్బంది అనిత, కామాక్షి, నాగమణి పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

చిల్లకూరు : గూడూరు ఒకటో పట్టణ విద్యుత్‌శాఖ ఏఈ ఏడుకొండలు తన తండ్రి శంకరయ్య జ్ఞాపకార్థం సోమవారం ఏరియా ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఏఈ మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

వాటర్ ప్యాకెట్ వివాదంపై కేసు నమోదు

పెళ్లకూరు: వాటర్ ప్యాకెట్‌కు రూ.2లు చెల్లింపుపై వివాదం చోటుచేసుకుంది. దీనిపై పెళ్లకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుని కథనం మేరకు.. మండలంలోని ముమ్మారెడ్డిగుంటకు చెందిన గిరి ఈ నెల 2న పుల్లూరులో ఓ దుకాణం వద్ద వాటర్ ప్యాకెట్ కొనుగోలు చేశాడు. చిల్లర లేకపోవడంతో ఫోన్‌పే చేస్తానని చెప్పాడు. సర్వర్ పనిచేయకపోవడంతో నగదు జమకాలేదు. ఈ క్రమంలో దుకాణం నిర్వాకురాలు, గిరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ విషయమై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ నాగరాజు కేసు నమోదు చేశారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న కొడుకుపై కేసు నమోదు చేయడంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎస్‌ఐని వివరణ కోరగా లోక్ అదాలత్‌లో సర్దుబాటు చేద్దామని తెలిపారు.

సచివాలయ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

కోట: కేసవరం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సీహెచ్ అనీల్‌కుమార్ సోమవారం ఆత్మహత్యకు యత్నించాడు. గ్రామస్తుల కథనం మేరకు.. మద్దాలికి చెందిన అనీల్‌కుమార్ ఈ నెల పింఛన్ల నగదును సక్రమంగా పంపిణీ చేయలేదన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. దీనిపై గూడూరు ఏఎస్‌డబ్ల్యూవో మనోజ్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది విచారణ చేపట్టారు. పింఛన్ల నగదు రూ.1.20 లక్షలు తిరిగి చెల్లించాల్సి ఉందని తేల్చారు. దీనిపై లిఖిత పూర్వకంగా సమాధానం తీసుకొనే క్రమంలో అనీల్‌కుమార్ అక్కడి నుంచి సమీప పొలాల్లోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. అతన్ని గూడూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అనీల్‌కుమార్ తండ్రి వేణయ్య మాట్లాడుతూ పింఛన్ నగదును కొంత మేర చెల్లించామని, మిగతా మొత్తాన్ని చెల్లిస్తామని చెప్పినట్టు తెలిపారు. అధికారుల ఒత్తిడితోనే అనీల్‌కుమార్ ఆత్మహత్యకు యత్నించినట్టు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



చిల్లకూరు : గూడూరు రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి గుండెపోటుతో వ్యక్తి మృతి చెందాడు. అతనికి సుమారు 48 ఏళ్ల ఉంటాయని పోలీసులు తెలిపారు. జేబులో ఒక టెస్టర్ ఉండడంతో అతను ఎలక్ట్రీషియన్ అయి ఉండొచ్చని పేర్కొన్నారు. మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదకర ప్రయాణం





పెళ్లకూరు మండలంలోని నందిమాల, అర్థమాల, కిష్టప్పకండ్రిగ, యడపూడి, పిడికిటిమాల, దిరసనమాల గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. అదేవిధంగా చెంబేడు, శిరసనంబేడు, నందిమాల, బంగారంపేట, పాలచ్చూరు, అనకవోలు, కలవకూరు, చావలి, చిల్లకూరు, పెళ్లకూరు తదితర గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు కూలి పనుల కోసం వెళుతుంటారు. ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రజలు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీన్ని ఆసరాగా తీసుకుంటున్న ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. ప్రమాదమని తెలిసినా ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. – పెళ్లకూరు

కిందకు వాలిన విద్యుత్ స్తంభం



చిట్టమూరు మండలంలోని అనగొల్లపాళెం సమీపంలోని పొలాల వద్ద హైపవర్ తీగలు ఉన్న విద్యుత్ స్తంభం కిందకు వాలిపోయి ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం ఎడగారు వరి పంటలు వేస్తున్నామని విద్యుత్ స్తంభం కిందకు వాలిపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. వరి నాట్లు వేస్తే కిందకు వాలిన స్తంభానికి మరమ్మతులు చేయడానికి ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్తంభాన్ని సరిచేయాలని కోరుతున్నారు. – చిట్టమూరు

హెచ్చరిక బోర్డు



కలువాయి మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా హెచ్చరిక బోర్డులు పెట్టారు. భూముల ఆక్రమణపై బాబోయ్ భూబోళ్లు అన్న శీర్షికన సాక్షి దినపత్రికలో ఏప్రిల్ 25వ తేదీన కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ స్పందించారు. ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని మండల అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులు సోమవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. – కలువాయి(సైదాపురం)

పాఠశాలల పరిరక్షణకు పోరాటాలు

- ప్రభుత్వ విధానాలతో పాఠశాలలు నిర్వీర్యం
- 14న రాష్ట్ర స్థాయిలో ఆందోళనలు
- ఏపీటీఎఫ్ నాయకులు వెల్లడి



నాయుడుపేట తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

వెంకటగిరి(సైదాపురం)/నాయుడుపేట టౌన్/ సూళ్లూరుపేట రూరల్/గూడూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు పోరాటాలు చేస్తామని ఏపీటీఎఫ్ నాయకులు తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వారు సోమవారం వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. వెంకటగిరిలో ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.సుబ్రమణ్యం, నాయుడుపేటలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.బాలసుబ్రహ్మణ్యం, జిల్లా సబ్ కమిటీ సభ్యులు జాన్‌హరి, పి.ప్రసాద్, సూళ్లూరుపేటలో ఏపీటీఎఫ్ ఉపాధ్యక్షుడు ఉస్మాన్‌బాష, గూడూరులో రాష్ట్ర నాయకుడు ఎస్ మోహన్‌దాస్, జిల్లా నాయకులు వై.సుబ్రహ్మణ్యంరాజు మాట్లాడారు. 117 జీవోను రద్దు చేసిన ప్రభుత్వం పాఠశాల వ్యవస్థ బలోపేతంతోపాటు ప్రభుత్వ బడుల పరిరక్షణకు శాస్త్రీయమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదన్నారు. ప్రాథమిక పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానం చేయాలన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం వల్ల విద్యార్థుల నమోదు తగ్గిపోతుందని, తద్వారా పాఠశాలలను మూసేసే ప్రమాదం ఉందన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6, 7 తరగతులు ఉంటే 4 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వ బడులను కాపాడుకునేందుకు 9న జిల్లా కేంద్రాలు, 14న రాష్ట్ర స్థాయిలో ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. తీర ప్రాంత గ్రామాల్లో ఉన్న పాఠశాలలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయా మండలాల తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. నాయుడుపేటలో నిర్వహించిన ధర్నాలో నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి, చిట్టమూరు మండలాల ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అల్లెయ్య, డాక్టర్ రాజేష్ ఆనంద్, వై.విజయలక్ష్మీ, ఎ.రమణ య్య, ఎ.రమణమ్మ, టి.వెంకటరమణయ్య, జి.నారాయణ, వెంకటేశ్వర్లు, సూళ్లూరుపేటలో గోపీనాథ్, సుధాకర్ రెడ్డి, రమణయ్య, సుజన్, రఘురామయ్య, గూడూరులో గూడూరు, చిల్లకూరు, ఏపీటీఎఫ్ నాయకులు రమణయ్య, మున్వర్‌బాషా, భాస్కర్ రాజు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటగిరిలో..



గూడూరులో..



సూళ్లూరుపేటలో..

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ఓజిలి: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించే ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మంచిదని డిస్ట్రిక్ట్ మోడల్ మేకర్ వీరరాఘవయ్య, ఓజిలి మండల ఇన్‌చార్జి జైతున్‌బీ తెలిపారు. చిలమానుచేను గ్రామంలో సోమవారం ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం – ఖరీఫ్ సాగుపై ప్రణాళికపై వ్యవసాయ, పశుసంవర్ధక, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా అవగాహన కలిగించాలన్నారు. అనంతరం ఆదర్శ రైతులు యల్లంరాజు భువనశేఖర్‌రాజు, కోడూరు సరోజమ్మను సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, సచివాలయం సిబ్బంది తిరుమల, చెంచమ్మ, అజిత, యామిని, రాజేష్, గురవయ్య, శ్రావణి, మాధురి, పాపారావు తదితరులు పాల్గొన్నారు.



రైతులను సన్మానిస్తున్న వీరరాఘవయ్య, జైతున్‌బీ

కృతజ్ఞతాభావమే సనాతన ధర్మం



అనుగ్రహ భాషణం చేస్తున్న స్వామీజీ

రాపూరు: కృతజ్ఞతాభావమే సనాతన ధర్మం అని ఉడిపి పీఠాధిపతి ఈషా ప్రియ తీర్థ స్వామీజీ తెలిపారు. ఆయన సోమవారం రాపూరులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అక్కడున్న 800 ఏళ్లనాటి శ్రీకృష్ణ స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. శ్రీకృష్ణ నామస్మరణతో అంతఃకరణ శుద్ధి కలుగుతుందన్నారు. తద్వారా వైరాగ్యం పోయి అంతరాత్మ శుద్ధి కలిగి జ్ఞానం పొందుతారని వివరించారు. గాలి, నీరు, భోజనం ఎవరిద్వారా లభిస్తుందో వారిపై కృతజ్ఞత భావం కలిగి ఉండాలని, అప్పుడే సనాతన ధర్మాన్ని కాపాడుకోగలమన్నారు. భగవద్గీత, రామాయణం, భాగవతం చదివి వాటి సారాంశాన్ని తెలుసుకోవాలన్నారు. అనంతరం ఆయన పెంచలకోనకు బయలుదేరి వెళ్లారు. ఆయనకు దామిశెట్టి శేఖర్ దంపతులు ఆహ్వానం పలికారు.

పోలేరమ్మకు భక్తిశ్రద్ధలతో అంబళ్లు



పూజలు చేస్తున్న అధికారులు, జాతర నిర్వాహకులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ జాతరలో భాగంగా సోమవారం భక్తులు భక్తిశ్రద్ధలతో అంబళ్లు పోశారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దేవాదాయశాఖ గూడూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, కార్యనిర్వహణ అధికారి ముసుమూరి రవికృష్ణ, జాతర నిర్వహణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ జాతరను మంగళవారం రాత్రి, బుధవారం వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఆలయ పరిసరాల్లో విద్యుత్ దీపాలతో అలంకరించామని, భక్తులకు ఎండ తగలకుండా టెంట్లు వేశామని వెల్లడించారు. అనంతరం పోలేరమ్మ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. రూ.2,29,216 ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జాతర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు నానబాల సుబ్బారావు, ఆలయ పెదకాపు ఆరవభూమి శ్రీనివాసులు రెడ్డి, అకులు కుబేరు మణి, గాదిరెడ్డి గోపి, నల్లబోతుల రామారావు, శ్యామ్, దేవదాయ శాఖకు చెందిన యుగంధర్, ఆలయ పూజారి రాయపూడి ముని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా జోన్లో చేర్చేందుకు గ్రామసభ తీర్మానాలు



గ్రామసభ నిర్వహిస్తున్న మత్స్యశాఖాధికారులు

చిల్లకూరు : ప్రభుత్వ రాయితీలు సక్రమంగా అందించేందుకు ఆక్వా సాగుదారులను ఆక్వా జోన్ పరిధిలోకి చేర్చాలని మత్స్యశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా సోమవారం చిల్లకూరు మండలంలో గ్రామసభలు నిర్వహించి రైతుల నుంచి తీర్మానం చేయించారు. చిల్లకూరు, కోట, చిట్టమూరు, వాకాడు మండలాల్లో వున్న ఆక్వా సాగుదారులు ఎక్కువ శాతం మంది జోన్ పరిధిలో లేరు. ఆక్వా జోన్‌లో చేరిన వారికి మాత్రమే రాయితీలు అందజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో మత్స్యశాఖాధికారులు ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రైతులు జోన్ పరిధిలో చేరేలా అవగాహన కల్పిస్తున్నారు. మోమిడి, ఏరూరు గ్రామ సర్పంచులు నెల్లిపూడి లావణ్య, ఆదేపూడి కామాక్షి ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి పంచాయతీ తీర్మానాలు తీసుకుని సుమారు 417 ఎకరాలను ఆక్వా జోన్ పరిధిలో కలిపేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చిల్లకూరు మత్స్యశాఖాధికారి రఘుబాబు తెలిపారు.

వీఆర్వో అక్రమాలపై విచారణ జరిపించాలని నిరసన

దక్కిలి: మండలంలోని వడ్ల మోపూరు వీఆర్వో విజయ్‌కుమార్ అక్రమాలపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రజా సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు గద్దల మునెయ్య డిమాండ్ చేశారు. ఆయన సోమవారం నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ మోపూరు సర్వే నంబరు 522–1లో 3 సెంట్ల స్థలాన్ని గతంలో అధికారులు బీఆర్ అంబేడ్కర్ విజ్ఞాన మందిరానికి కేటాయించి అనుమతుల కోసం జిల్లా అధికారులకు పంపించినట్టు తెలిపారు. సదరు స్థలానికి వీఆర్వో నకిలీ పట్టాలు సృష్టించి గుడిసెలు వేయిస్తున్నాడని ఆరోపించారు. అంతేగాక ప్రజల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నాడని, గతంలో అక్రమాలకు పాల్పడి సస్పెండ్ అయినట్టు తెలిపారు. అనంతరం డీటీకి వినతి పత్రం అందజేశారు. నన్నెం మునెయ్య, కరిపం శీనయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

7, 8, 9 తేదీల్లో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణంలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఈ నెల 7, 8, 9 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ ప్రతినిధి చిట్టేటి పెరుమాళ్లు తెలిపారు. ఆయన సోమవారం ఉత్సవాల ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో భక్తులు ఎక్కువ మంది పాల్గొంటారని, అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. అలాగే ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ–పార్థసారథి దంపతుల సహకారంతో గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో చిట్టేటి రామదాసు, చిట్టేటి విజయ్‌కుమార్, రూపేష్, సతీష్, వెంకటేష్, మునిరాజా, వినోద్, వేమనబోయిన చెంగయ్య, బట్టా సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

షార్‌లో ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



సింఘానెనికి రాకెట్ నమూనాను అందజేస్తున్న షార్ డైరెక్టర్ ఏ రాజరాజన్

సూళ్లూరుపేట : సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని బ్రహ్మప్రకాష్ హాలులో సోమవారం షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అధ్యక్షతన జాతీయ అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో నాగపూర్‌లోని నేషనల్ ఫైర్ సర్వీస్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌బీ సింఘానెని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ షార్ కేంద్రంలో సేఫ్టీ మెజర్‌మెంట్స్ సక్రమంగా వున్నాయన్నారు. అగ్నిమాపక విభాగం కూడా అప్రమత్తంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. భారతదేశానికి గుండెకాయ లాంటి రాకెట్ కేంద్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా వుందని వివరించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఎం.శ్రీనివాసులురెడ్డి, సేఫ్టీ ఆపరేషన్ అండ్ సిస్టం ఎన్టీటీ సీజీఎం పి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో అభివృద్ధి చెందాలి



కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నాయుడుపేట టౌన్ : మహిళలు స్వశక్తితో అభివృద్ధి చెందాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఆమె సోమవారం నాయుడుపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో పొదుపు మహిళల కోసం ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, వైస్ చైర్మన్ షేక్ రఫీ, నాయకులు పార్థు, పోట్లాపూడి రాజేష్, గూడూరు సుధీర్ రెడ్డి, దార్ల రాజేంద్ర, ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



గూడూరు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

గూడూరు రూరల్/వెంకటగిరి (సైదాపురం) : ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు కోరారు. వారు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గూడూరు, వెంకటగిరి తహసీల్దార్లు చంద్రశేఖర్, రాంబాబుకు వినతి పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ 2019 సర్క్యులర్‌ను విధిగా అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గ్యారేజీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. గూడూరులో జోనల్ అసిస్టెంట్ కార్యదర్శి అహ్మద్, రీజనల్ అసిస్టెంట్ సెక్రటరీ శ్రీనివాసులు, డిపో సెక్రటరీ శ్రీనివాసులు, డిపో అధ్యక్షుడు ప్రవీణ్, కోశాధికారి గౌస్, వెంకటగిరిలో డిపో ప్రెసిడెంట్ వీపీరావు, కార్యదర్శి కేవీ రత్నం, ట్రెజరర్ ఏఎం గురవయ్య, జాయింట్ సెక్రటరీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతుకు తీవ్ర నష్టం



చిట్టేడు వద్ద నేలరాలిన మామిడి కాయలను ఏరుతున్న రైతులు

కోట: మండలంలో ఆదివారం కురిసిన అకాల వర్షం మామిడి రైతుకు తీవ్ర నష్టాన్ని కలిగించింది. ఈదురు గాలులకు కోట, గూడలి, చిట్టేడు, కేసవరం, చంద్రశేఖర పురం ప్రాంతాల్లోని మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. నేలరాలిన మామిడి కాయలను తక్కువ ధరకు విక్రయించి ఎంతో కొంత సొమ్ము చేసుకోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

సూళ్లూరుపేట : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు హెచ్చరించారు. వారు సోమవారం రౌడీ షీటర్స్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. వారు మాట్లాడుతూ రౌడీ షీటర్ నమోదైన వారిపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. ఒకవేళ ఎక్కడికైనా వెళితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అలా ఇవ్వని పక్షంలో తర్వాత రోజు పోలీసు స్టేషన్‌కు పిలిపించి స్పెషల్ కౌన్సెలింగ్ ఇస్తామని తెలిపారు. మార్పు వస్తే రౌడీషీట్‌ను తొలగించేందుకు ఉన్నతాధికారులకు రెఫర్ చేస్తామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సైదాపురం: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ హెచ్చరించారు. ఆయన సోమవారం మర్లపూడి, కొమ్మిపాడు, చాగణం, సైదాపురం సచివాలయాలను తనిఖీ చేశారు. సర్వేలపై ఆరా తీశారు. ప్రజలకు సత్వరం సేవలు అందించాలని ఆదేశించారు.

గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ

దొరవారిసత్రం : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శైలకుమారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రైతుల నుంచి భూ సమస్యలు వెల్లువెత్తాయి. పట్టాదారు పాస్ పుస్తకాలు, 1బీ, అడంగళ్లలో చేర్పులు, మార్పులు తదితరాలపై వినతులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోవర్ధన, పలు శాఖల ఏఈలు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాల తనిఖీ

బాలాయపల్లి(సైదాపురం) : చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించి ఎరువులు తయారు చేసి ఆదాయం పొందాలని ఎంపీడీవో వినీల్‌కుమార్ ఆదేశించారు. ఆయన సోమవారం బాలాయపల్లిలోని చెత్త సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లు గ్రామాల నుంచి తడి, పొడి చెత్తను సేకరించి చెత్త సంపద కేంద్రానికి తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తర్వాత వర్మీకంపోస్టు తయారుచేసి రైతులకు విక్రయించాలన్నారు. వచ్చిన నగదుతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేయాలని తెలిపారు. ఈవోపీఆర్డీ మోహన్‌రాజు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలి

వెంకటగిరి(సైదాపురం): పట్టణంలోని 14వ వార్డులో అదనంగా మరో ముగ్గురు పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలని కౌన్సిలర్ ఆరిశంకరయ్య కోరారు. ఆయన సోమవారం ప్రజల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. వాటిని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మాట్లాడుతూ 14వ వార్డులో మున్సిపల్ కోర్టు, పెద్దాస్పత్రి, పోస్టాఫీసు, సబ్ రిజిస్ట్రార్ తదితర కార్యాలయాలు ఉన్నాయన్నారు. ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులు ఉండటంతో వారిపై పనిభారం పడుతోందన్నారు.

'మా భూములపై రుణాలు తీసుకున్నారు'

సైదాపురం: 'మాకు తెలియకుండానే మా భూములపై బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. రుణం చెల్లించలేదని అధికారులు వేలం నోటీసులు ఇచ్చారు. న్యాయం చేయండి' అని మర్లపూడికి చెందిన వరదబండి ప్రభాకర్‌రెడ్డితోపాటు గ్రామస్తులు వాపోయారు. వారు సోమవారం నెల్లూరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ కొమ్మిపాడు రెవెన్యూ పరిధిలోని మర్లపూడిలో 32 మందికి ఉమ్మడి భూమి ఉందన్నారు. 2001లో అందులో 20 కుటుంబాల వారము ఇళ్లు నిర్మించుకున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో తమ గ్రామానికి చెందిన నవనీతమ్మ సర్వే నంబర్ 487 –1 నుంచి 487–7 వరకు వున్న భూమికి నకిలీ పాసుపుస్తకాలు సృష్టించి 2016లో సైదాపురం సింగిల్‌విండోలో రుణం తీసుకున్నట్టు తెలిపారు. దాన్ని చెల్లించకపోవడంతో అధికారులు వేలం నోటీసులు ఇచ్చారని తెలిపారు. దీనిపై విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

గేదెలపై కుక్కల దాడి

బాలాయపల్లి(సైదాపురం): బాలాయపల్లిలో సోమవారం గేదెలపై కుక్కలు దాడి చేశాయి. దీంతో గేదెలు గాయపడ్డాయి. వాటిని స్థానిక పశువైద్యశాలకు తరలించారు. పశువైద్యాధికారి సుధీర్ వాటికి చికిత్స చేశారు. గ్రామంలో వీధి కుక్కలు ఎక్కువగా ఉన్నాయని, వాటి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కండలేరులో 45.057 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 45.057 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 60, పిన్నేరు కాలువకు 150, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గూడూరు : 90108 97733, 99122 20591
వెంకటగిరి : 99122 20591
సూళ్లూరుపేట : 90102 23710